www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 06 | నవంబర్ | 2025 పేజీలు : 8

## వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు




# కిరాయి హత్యేనా..? చేసింది ఎవరు..? చేయించింది ఎవరు..?





**-హత్య కేసులో కానరాని పురోగతి**
**-జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సిపిఎం ఆందోళనలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి పురోగతి కనిపించడం లేదు. మొత్తంగా ఇది కిరాయి హంతకుల పనేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రామారావును హత్య చేసిన కిరాయి హంతకులు ఎవరు...? ఎక్కడి నుంచి వచ్చారు. కిరాయి హంతకులతో మాట్లాడింది ఎవరు. ఆర్థికంగా ఎవరు సహకరించారనే దానిపై స్పష్టత రావడం లేదు.

మిగతా 2లో..

## గిరిజన ఉద్యమ కెరటం ధర్మ

**- జిల్లా ప్రజలకు ధర్మ అందించిన సేవలు చిరస్మరణీయం**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం గుగులోత్ ధర్మ నిర్వహించిన ఉద్యమాలు నేటి తరానికి ఆదర్శం అని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఎం సనీయర్ నాయకులు, గిరిజన నేత గుగులోత్ ధర్మ ద్వితీయ వర్థంతి సందర్భంగా సుజాత నగర్ మండలంలోని మంగపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధర్మ విగ్రహావిష్కరణ, సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ధర్మ ఉమ్మడి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచి లాంటి వాడని, ఎన్నో ప్రజా, రైతు, గిరిజనోద్యమాలకు నాయకత్వంవహించారని చెపాప్ర.ఉ ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాడని కొనియాడారు. అనంతరంవిగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మండల నాయకులు భూక్యా ధస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# అందిన కాడికి దోపిడీ..!



**-ఫ్యాక్టరీలను తలపిస్తున్న ఇసుక బట్టీలు**
**-ముడుపుల మత్తులో అధికారులు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో అన ధికారికంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వహణ ఫ్యాక్టరీలను తలపించే విధంగా ఉన్నాయి. కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. అశ్వాపురం మండలంలో తుమ్మలచెరువు, మొండికుంట, గొల్ల గూడెం, జగ్గారం పంచాయితీ పరిధిలో గల ఇటుక బట్టీల నిర్వహణ జరుగుతుంది. మొత్తంగా ఈ వ్యాపా రం అనధికారికంగా నిర్వహిస్తున్న అధికారుల అండదండలతో అధికారికంగానే నిర్వహిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు ముడుపులు అందిస్తూ ప్రజల ఆదాయానికి పంచాయితీ ఆదాయానికి భారీ గండి కొడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొందరు అక్రమార్కులు సాగు భూముల్లో యథేచ్ఛగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తు కోట్లు కొల్లగొట్టేస్తున్నారు. అన్నదాతల అమాయకత్వం, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని విలువైన సాగు భూములను ఇష్టారాజ్యంగా

మిగతా 2లో..

**మన యోధులు ..1**

# ఖమ్మం తొలి ఎంపి విఠల్‌రావు






**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్ని రోజులు ప్రజాప్రతినిధిగా ఉన్నాం, ఆ కాలంలో ఏమి సాధించాం అన్నదే ప్రధానం. చైతన్యపు గుమ్మం ఖమ్మం నుంచి తొలిసారి పార్లమెంటుకు ఎన్నికైన టిబి విఠల్‌రావు జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం. రైల్వేలో సాధారణ ఉద్యోగిగా ప్రారంభమైన ఆయన జీవితం పార్లమెంటు సభ్యునిగా, కార్మిక నాయకునిగా యావత్ దేశం గుర్తుంచుకునే రీతిలో సాగింది. సింగరేణిలో కార్మికుల పక్షాన పోరాడి తొలిసారి బోనస్ సాధించిన ఘనత ఆయనది. రైల్వేలో చిరుద్యోగిగా చేరిన ఆయన రైల్వేబోర్డు సభ్యునిగా , రైల్వేల అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. టిబి విఠల్‌రావు 1915 ఆగస్టు 16న కన్నడిగ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు టిడి బాలకృష్ణన్ విఠల్‌రావు విద్యాభ్యాసం బెంగళూరు లోని సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలో సాగింది. విద్యాభ్యాసం తర్వాత రైల్వేలో ఉద్యోగిగా చేరిన విఠల్‌రావు మగ్దూం మోహినుద్దీన్‌తో

మిగతా 2లో..

# కిరాయి హత్యేనా..? చేసింది ఎవరు..? చేయించింది ఎవరు...?

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు రామారావు హత్య కేసుకు సంబంధించి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఐదు ప్రత్యేక బృందాలు వారం రోజులుగా శ్రమిస్తున్నా ఆధారాలు దొరకడం లేదు. ప్రాథమికంగా సుపారీ ఇచ్చి హత్య చేయించారన్న నిర్ధారణకు వచ్చిన చేయించింది ఎవరన్న దాని వద్దే దర్యాప్తు నిలిచిపోతుంది. జిల్లాలో  దశాబ్ద కాలంగా రాజకీయ హత్యలు లేవు. ఆర్థిక లేదా అక్రమ సంబంధాల నేపథ్యంలోనే హత్యలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం బోనకల్ మండలం గోవిందాపురంలో ఘర్షణల నేపథ్యంలో సిపిఎం కార్యకర్త హత్యకు గురయ్యాడు. మరల ఇప్పుడు అదే మధిర నియోజక వర్గంలో సిపిఎం నాయకుడు హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది. జిల్లాలో ఏ రాజకీయ నాయకుని హత్య కేసులోనూ దోషులను తేల్చడంలో ఇంత జాప్యం జరగలేదు. సహజంగా రాజకీయ హత్యలు జరిగినప్పుడు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేయడం జరుగుతుంది. సామినేని రామారావు భార్య స్వరాజ్యం తన భర్తను ఒక గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడుస్తున్నప్పుడు పాతర్లపాడుకు చెందిన ఐదుగురు పక్కనే ఉన్నారంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేశారు. గ్రామంలో ఎక్కడ సిసి ఫుటేజీలు లేకపోవడం, హంతకుడు అత్యంత పకడ్బందీగా వ్యవహరించడం పోలీస్ దర్యాప్తుకు సవాల్‌గా మారింది. రామారావుకు సంబంధించి ఆర్థిక, రాజకీయ, బంధుత్వ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేసినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నది సమాచారం. ఈ హత్య కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందని సిపిఎం ఆరోపిస్తుంది. గడిచిన మూడు రోజులుగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ ఆందోళనలు కొనసాగిస్తున్నది. నేరుగా అటు పోలీసులు, ఇటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పైన ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ మార్క్ విచారణ జరుగుతుందని సిపిఎం నాయకులు ఆరోపిస్తున్నారు.  పోలీసులు మాత్రం ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేదని పూర్తి స్థాయిలో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతుందని వివరాలను అతి త్వరలో వెల్లడిస్తామని చెబుతున్నారు. మొత్తంగా సంచలనం సృష్టించిన ఈ హత్య కేసులో దోషులు ఎవరన్నది తేలాల్సి ఉంది.

# ఖమ్మం తొలి ఎంపి వితల్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

పరిచయం ఏర్పడింది. అప్పటి పరిస్థితులు తెలంగాణలోని నిజాం రాచరిక తీరు ట్రేడ్ యూనియన్ ఉద్యమం వైపు మరలేలా చేశాయి. రైల్వే సింగరేణి కార్మిక సమస్యలపై ప్రత్యక్ష పోరాటాల స్థాయికి తీసుకెళ్లింది. 1943లో జూన్ 13న సుగంధనీ దేవితో వివాహమైంది. వితల్‌రావుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వితల్‌రావు హైదరాబాద్ చుట్టూ పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాలను స్థాపించారు. 1952లో తొలిసారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎంపిగా, రైల్వేబోర్డు సభ్యునిగా, ప్రమాద నివారణ కమిటీ సభ్యునిగా రైల్వేల అభివృద్ధికి కృషి చేశారు. ప్రయాణికులకు సదుపాయాల కల్పన, స్టేషన్ల ఏర్పాటుకు పోరాడారు. 1957లో రెండవ సారి పార్లమెంటుకు ఎన్నికైన వితల్‌రావు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా పని చేశారు. 1963 64లో తొలిసారి బోనస్‌ను అందించి యావత్ కార్మికుల హృదిలో నిలిచిపోయారు. కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనే ఆశయంగా పనిచేసిన వితల్‌రావు 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ వైపు నిలిచారు. చీలిక తర్వాత సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1965లో కొత్తగూడెంలోని ఐదవ ఇంక్లైన్ కార్మిక సమస్యలపై చర్చిస్తూ తుది శ్వాస విడిచారు. కార్మిక, కర్షక, నిరుపేద, బడుగు వర్గాల సమస్యలను ఎలుగెత్తి చాటుతూ అనేక ఉద్యమాలను నిర్మించిన పోరాట వీరుడు వితల్‌రావు చిరస్మరణీయుడు.

# వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు








**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం దేవాలయాలు ప్రత్యేకించి శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.   తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైనదిగా భావించే కార్తీక పౌర్ణమి రోజున ఆలయాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. పౌర్ణమి నాడు జరిపే పూజలు, వ్రతాలు, దీపారాధనలు పుణ్య ఫలితాలను అనేక రేట్లు పెంచుతాయని భక్తుల నమ్మకం. శివ పురాణం ప్రకారం శివుడు త్రిపురాసురులను సంహరించి దేవతలకు విముక్తి కలిగించిన రోజుగా కార్తీక పౌర్ణమిని జరుపుకుంటారు. ఖమ్మం నగరంలోని ప్రధాన ఆలయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో దీపాలను వెలిగించారు. 365 వత్తులతో కూడిన దీపాలను వెలిగించడం ద్వారా పుణ్య పూజా ఫలితాలు దక్కుతాయని భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో గల గుంటుమల్లన్న స్వామి దేవాలయంలో శివునికి  మంచు పర్వతాలతో కూడిన అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

**-భక్తులతో పోటెత్తిన ఆలయాలు**







**ప్రజాపక్షం/భద్రాచలం :** అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం దేవాలయాలు పోటెత్తాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు తెల్లవారు ఝామునే పావన గోదావరి తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. చలి లో సైతం పిల్లా పాపలతో నదీ తీరం వద్దకు చేరుకున్న భక్తులు గోదావరిలో మునకలేస్తూ ఓం నమోఃశివాయా అంటూ శివ నామ స్మరణ చేశారు. కోరిన కోర్కెలు తీరాలని, బ్రతుకుల్లో వెలుగులు నిండాలని కోరుకుంటూ గోదావరి తీరంలో మహిళలు దీపాలను నదిలో వదిలారు. అరటిదొప్పల్లో  ఒక్కొక్క దీపం వెంట మరో దీపం నది ప్రవహంలో ముందుకు సాగుతుంటే అత్యంత భక్తిభావం ఉట్టి పడింది.  శుద్ద పూర్ణిమ శివకేషవులకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజుల కావడంతో శివాలయాల వద్ద అత్యంత భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయంలోతో పాటు శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. జై శ్రీరామ్ అంటూ భక్తులు పెద్దపెట్టున ఆలయాల్లో స్మరణ చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రామాలయంతో పాటు అనుబంధ ఆలయమైన శివాలయం, ఇతర ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

# అందిన కాడికి దోపిడీ..!



(మొదటిపేజీ తరువాయి)

తవ్వేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఇటుక బట్టీల దందా ముడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిలుతోంది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో వారి ఇటుక వ్యాపారం బంగారు వ్యాపారంగా మారింది. నిర్ణీత ధర అంటూ ఏమీ లేకపోవడంతో అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. ఒక్కో ఇటుకను సుమారు రూ 5 నుండి 15 వరకు విక్రయించడంతో మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు జంకుతున్నారు. పెట్టుబడికి మూడింతల లాభాలు గడిస్తున్నా వ్యాపారులు ఎలాంటి పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం చేస్తున్నారు. మండలంలో ఇందిరమ్మ గృహ నిర్మాణం పనులు ఊపందుకోవడంతో ఇటుక బట్టీల వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. బట్టీల ఏర్పాటుపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ మారుమూల గ్రామాల్లోను ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్న అధికారులు మాములుగానే తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఏ ఒక్కదానికి అధికారికంగా అనుమతులు లేవని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఇవి వెదజల్లే కాలుష్యం, బూడిద దుమ్ము ధూళితో బట్టీల సమీపంలో ఉన్న పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు ప్రకారం ఇటుక బట్టీలను ఏర్పాటు చేసేందుకు రెవిన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాల్సి ఉండగా, అదే విధంగా స్థానిక గ్రామ పంచాయితీలో తీర్మానం కూడా తప్పని సరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ అధికారి అనుమతులు సైతం తీసుకోవాలని కానీ ఇక్కడా ఇవేమీ లేకుండానే పలువురు ఇటుక బట్టీలను ఏర్పాటు చేసి, అధిక లాభాలను గడిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని సగటు మధ్యతరగతి వ్యక్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు నిప్పంటించడంతో చుట్టు పక్క గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. ప్రక్న ఉన్న అటవీ ప్రాంతం నుండి యథేచ్ఛగా కలపను తరలించి ఇటుక బట్టీలను కాల్చుతున్న అటవీ శాఖ అధికారులు మౌనంగా ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది. విలువైన అటవీ సంపదను ఇటుక బట్టీలకు తరలిస్తూ బూడిద చేసేస్తున్నారు. అదే విధంగా ఈ ఇటుక బట్టీల నిర్వహకులు ఇటుక బట్టీల ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటుక బట్టీల వ్యాపారం చేసే యాజమానులు విద్యుత్ శాఖ నుండి ప్రత్యేక అనుమతులు పొందిన తర్వాతనే విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉండగా, అలా కాకుండా స్థానికంగా విధులు నిర్వహించే విద్యుత్ శాఖ సిబ్బందికి మాముళ్లతో ఎర వేస్తూ ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ శాఖ కూడా లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ విద్యుత్ వాడకానికి అడ్డూఅదుపే లేకుండా పోతుందని పలువురు విమర్శిస్తున్నారు. కొన్ని బట్టీలలో బాల కార్మికులతో వెట్టి చారికి సైతం చేయిస్తున్నారో ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపుగా మండలంలో 60 వరకు ఇటుక బట్టీలు ఉన్నట్లు వినికిడి. వీరంతా మైనింగ్ శాఖ అనుమతులు తీసుకుంటే లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఒక్కో బట్టి యాజమాని ప్రతి నెల రూ 2వేల నుండి 5వేల వరకు అధికారులకు ముట్టచెప్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్న వీటిపై చర్యలు ఎందుకు లేవని ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, అశ్వాపురం మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు



**పజాపక్షం/ఏన్కూరు:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే నిద్ర లేచి తల స్నానాలు ఆచరించి ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల వద్దకు చేరుకొని అరటి మట్టల్లో ఒత్తులు పెట్టి వెలిగించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గార్ల ఒడ్డు శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయం, నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయం, తూతక్క లింగన్నపేట రామాలయం, హిమాంనగర్ లో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, బురద రాఘవాపురం శివాలయం తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం కావటంతో అయ్యప్ప స్వాములు, మహిళలు, చిన్నారులతో ఆలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం వేళలో ఏన్కూర్, బురద రాఘవాపురం శివాలయాల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని ఒత్తులు వెలిగించారు.

# హలో కామ్రేడ్.. చలో ఖమ్మం..!



**-డిసెంబర్ 26న**
**జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ నాయకులు చింతల రమేష్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** భారత గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ ఆరున నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ సిపిఐ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామా గ్రామాన పండుగ వాతావరణంలో ఉత్సహ పూరితంగా జరుపుకోవాలన్నారు. డిసెంబర్ 26 నాటికి శత వసంతాలు పూర్తవుతాయని ఈ సందర్భంగా ఖమ్మంలో జరిగే శత వసంతాల ముగింపు బహిరంగ సభకు లక్షలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత జరిగిన ప్రతి ఉద్యమంలో, ప్రతి పోరాటంలో సిపిఐ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. నాడు దేశంలో ఉన్న దొరలు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లకు వ్యతిరేకంగా పేద ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సిపిఐదేనన్నారు. ప్రజలను చైతన్యం చేసి వారిని పోరాటాల వైపు నడిపించి ప్రశ్నించేతత్వాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఎంతో మంది కమ్యూనిస్టు యోధులు ఎర్ర జెండా కోసం ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి గాడిచర్ల సత్యనారాయణ, సభ్యులు విష్ణుమూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ అల్లిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వివిపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు ప్రారంభించారు. బుధవారం వి.వెంకటాయపాలెం సొసైటీ ఆధ్వర్యంలో అల్లిపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, తహసీల్దార్ సైదులు, ఏవో కిషోర్ లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రేడ్ ఎ రకం ధాన్యానికి రూ. 2389, గ్రేడ్ బి రకం ధాన్యానికి రూ. 2369 మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా తేమ శాతం 17 లోపు ఉంటే మద్దతు ధర వస్తుందన్నారు. దీనితో పాటు సన్న రకాలకు ప్రభుత్వం రూ. 500 బోనస్ కూడా అందిస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. సొసైటీ ఆధ్వర్యంలో వి.వెంకటాయపాలెం, కొత్తగూడెం ప్రాంతాల్లో కూడా కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఈవో ఐ. తిరుపతిరావు, డైరెక్టర్లు నాగేశ్వరరావు, ఆదినారాయణ, రైతులు పత్తిపాటి వీరయ్య, దమ్మలపాటి సైదులు, రావూరి లక్ష్మయ్య, ఎం. బాలకృష్ణ, పి. శ్రీనివాసరావు, పి. అప్పారావు, సత్యం, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీనిధి విద్యార్థులు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు, సిహెచ్.చందు తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మధిర జోన్‌లో మొదటి స్థానం సాధించి ఖమ్మం భద్రాద్రికొత్తగూడెం ఉమ్మడి జిల్లా స్థాయిలో విద్యార్థులు బి.ఉదయశ్రీ, ఎం.మౌనికలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా నవంబర్ 8 నుండి 10వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్ళబయ్యారంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు ఆక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను వీరితో పాటు వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పిడి ప్రవీణ్‌కుమార్, పిఇటి కర్ష్మి తదితరులు అభినందించారు.

# రామారావును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



**- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**
**- మధిరలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో సంచలనం కలిగించిన బోనకల్ మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సామినేని రామారావు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామారావు హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మధిర పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ 74 సంవత్సరాల వయస్సు గల సిపిఎం పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా పనిచేసిన సామినేని రామారావును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులే పథకం ప్రకారం హత్య చేయించినట్లు భార్య సామినేని స్వరాజ్యం ఫిర్యాదు చేసినా వారిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన సామినేని కుటుంబాన్ని విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. రామారావుపై హత్య జరిగి వారంరోజులు గడుస్తున్నా ఇంతవరకు పోలీసులు నిందితులను పట్టుకోవడంలో ఆలసత్వం వహిస్తున్నారని, అధికార పార్టీ నాయకులుకావడంతో ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లతో దోషులను పట్టుకోకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తూ పేదలకు అండగా నిలిచే కమ్యూనిస్టు పార్టీలకు హత్యలను, దాడులను ఎదుర్కొవడం కష్టమేమి కాదని అన్నారు. తమకు చట్టంపై గౌరవం ఉందని, చట్టరీత్యా నిజమైన హంతకులను శిక్ష పడే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హత్య రాజకీయాలకు తావు లేకుండా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఇలాకలో జరిగిన ఈ హత్య కేసులో నిందితులను గుర్తించి వెంటనే వారికి చట్టపరమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, సీనియర్ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, బోనకల్ మండల కార్యదర్శి కిలార్ సురేష్, మధిర పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, డివిజన్ నాయకుల పాపినేని రామనర్సయ్య, ఎర్రుపాలెం పార్టీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మందడపు ఉపేంద్ర, సునీత, ధనలక్ష్మి , గుండ్లపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

# రేపు జాబ్‌మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం భారత్ హ్యూండయ్ ప్రై.లిమిటెడ్ ఖమ్మం నందు సేల్స్ కన్సల్టేంట్స్ (మేల్) 22, సర్వీస్ అడ్వయిజర్ రెండు ఉద్యోగాలకు ఈనెల ఏడున జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఏడున శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం లలో పనిచేసేవిధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టులకు ఏదైనా డిగ్రీ, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల 22 నుంచి 30 సంవత్సరాల వయస్సుల యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ. 18వేలు ఉంటుందని తెలిపారు. సర్వీస్ అడ్వయిజర్ ఉద్యోగాల ఖాళీలకు డిజీల్ మెకానిక్, బిటెక్ మెకానిక్ అర్హత గల 22 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12వేల వేతనం ఉంటుందన్నారు. మొత్తం 24 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో ఆసక్తి గల యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7036902902 నెంబర్‌ను సంప్రదించాలని ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

# శివ నామస్మరణతో మారుమోగిన మృత్యుంజయస్వామి ఆలయం

**ప్రజాపక్షం/ మధిర :** కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని మధిర పట్టణంలో వేంచేసియున్న శ్రీ మృత్యుంజయస్వామి ఆలయం భక్తుల శివనామస్మరణతో మారమ్రోగింది. బుధవారం తెల్లవారుజాము నుండే భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం, పూజా కార్యక్రమాలను భక్తులుఅత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలను వైరానదిలో వదిలారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తులు, అయ్యప్పలు అధికసంఖ్యలో పాల్గొని శివునికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# సిపిఐ శత వసంతాల పండుగను జయప్రదం చేయండి : యర్రా బాబు





**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మంలో డిసెంబర్26వ తారీఖున జరిగే సిపిఐ శత వసంతాల పండుగ సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ ప్రదర్శన జరుగుతున్న సందర్భంగా వైరా మండలంలో వైరా సోమవరం, తాటిపూడి గ్రామాల్లో ప్రచారం నిధులు సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్ర బాబు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఇంటింటా సిపిఐ ప్రచారం నిర్వహించారు. ఈ బహిరంగ సభను ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, మండల కౌన్సిల్ సభ్యులు బండారుపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోవు సకల దేవతా స్వరూపం

**డాక్టర్ కాపా మురళీకృష్ణ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని వైరా భగవాన్ శ్రీసత్యసాయి బాబా గోశాలకు గోవును జోన్ చైర్మన్ లయన్ చింతోజు నాగేశ్వరరావు, సీత కుటుంబ సభ్యులు బుధవారం ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా గోశాల నిర్వాహకులు సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ గోవు సకల దేవత స్వరూపమని సమస్త దేవతలంతా గోవులోనే కొలువై ఉంటారని, ఈ కారణంగానే గోమాతను పూజించడం వలన సకల దేవతలను ఆరాధించిన ఫలితం దక్కుతుందని పేర్కొన్నారు. శక్తి స్వరూపిణి అమ్మవారు తర్వాత గోమాత అని పిలిపించుకునే ఏకైక జీవి ఒక ఆవు మాత్రమే అని తెలిపారు. గోవును దానం చేయడం వలన జన్మజన్మల పాపాలు హరించవేయబడతాయని అన్నారు. కార్తీక పౌర్ణమి రోజున నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు గోవును దానం చేయడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొల్లపూడి వృద్ధాశ్రమంలో పోలు వెంకటేశ్వరరావు సతీమణి సుధారాణి వర్ధంతి సందర్భంగా 25 మంది వృద్ధులకు మఫ్లర్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో విజన్ కోర్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్‌రావు, క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్ అబ్బూరి రమేష్, ఏపూరి రాజారావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు కె.భాస్కర్‌రావు, ఎస్ఎస్.కుమార్, డాక్టర్ ఉమా, బి.రత్నం, రుద్రాక్ష నర్సింహాచార్యులు, పి.నాగేశ్వరరావు, కె.ప్రవత్తులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి

**-మార్కెట్‌ను సందర్శించిన సిపిఐ బృందం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. బుధవారం సిపిఐ నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరిగే సమయం కాబట్టి వీలైనంత తొందరగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా ఖమ్మం ఉందని తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్లగొండతో పాటు ఆంధ్రా నుంచి కూడా వచ్చి ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయిస్తారని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్ పనులను పూర్తి చేయాలని జానిమియా కోరారు. మిర్చి సీజన్ త్వరలో ప్రారంభం కానుందని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేవిధంగా ఉందని పత్తి కొనుగోలుపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకలమేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, నాయకులు భూక్యా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**- సిపిఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సమాజంలో అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా వార్తాలు రాస్తే హక్కు జర్నలిస్టులకు ఉందని, ఆహక్కులను కాలరాసే విధంగా జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, 30వ డివిజన్ సిపిఐ సెక్రటరీ బియ్యాల రాజు అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ నందు సిపిఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు అండగా నిరసన చేపట్టి ధర్నా నిర్వహించారు. అలాగే పలువురు, మేధావులు, రాజకీయపార్టీల నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ...తమ అక్రమ వ్యవహారాలపై వార్తలు రాస్తున్న విలేకరుల చేతుల నరికేస్తా, కల్లు విరగొడతానని, కుసంస్కారహీనులుగా మాట్లాడటం మంచి పరిణామం కాదన్నారు. ఈ విధమైన వ్యవహారం కొత్త తరహా విధానానికి దారితీస్తే ప్రమాదం ఉందన్నారు. దాడులను ప్రేరేపించేలా వ్యవహరించేవారిపై పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు భద్రతను కల్పిస్తూ ప్రభుత్వం వారి హక్కులను కాపాడాలని కోరారు. దీనిపై నిఘావర్గాలు సైతం ఆరా తీయడంతో బెదిరింపు దోరణిని తేటతెల్లం చేసింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ యువజన సంఘం 28,29,30వ డివిజన్ నాయకులు మిరియాల నరుణ్‌తేజ్, అక్కినపల్లి దేవయ్య, యువజన సంఘం సభ్యులు ప్రభాకర్, బాబీ, నాగేంద్రబాబు, సంపత్, సిపిఐ నాయకులు హన్నే, పానమాకులు కృపాకర్, సిపిఐ సోషల్‌మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు ఉన్నారు.

# పాలేరు ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీసు ముందు ఖోనో ఖర్పస్ మొక్కలు

**-ఆరోగ్యానికి హానికరం**
**-పర్యావరణానికే పరాయి మొక్కలు**
**-పట్టించుకోని అధికారులు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పాలేరు ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయం ముందు(గంగ బండ తండ గ్రామ పంచాయితీ పరిధిలో)పర్యావరణానికి పరాయి మొక్కగా ఉన్న ఖోనో ఖర్పస్ మొక్కలు, చెట్లు దర్శనమిస్తున్నాయి. ఈ మొక్కలు మనుషుల ఆరోగ్యానికి హానికరమైనవి అని అనేక దేశాల్లో గుర్తించి వీటిని తొలగిస్తున్నారు. కానీ కూసుమంచి మండలంలోని పాలేరు ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయం ముందు ఈ మొక్కలు ఒక స్థాయి వృక్షాలుగా ఉండటం విశేషం..

### ఖోనో ఖర్పస్ ప్రత్యేకత...

పర్యావరణానికి పరాయి మొక్కగా ఉన్న ఖోనో ఖర్పస్ చెట్లు అంటే పంట పొలాల్లో కలుపు మొక్కల లాంటిది(ఈ ఖోనో కర్పస్ మొక్క)పంట పొలాలను కలుపు మొక్కలు వివిధ పంటలకు హానీ చేసినట్లుగానే ఈ ఖోనో కార్పస్ హాని చేస్తుంది. ఈ చెట్టుపై ఎప్పుడైన ఎక్కడైనా ఎవరికైనా ఏదైనా ఒక పక్షి ఈ చెట్టుపై ఉన్నట్లుగా చూసింది లేదు ఇంకా చెప్పాలంటే ఈ చెట్టు గురించి ప్రకృతిలో ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్డయాక్సైడ్‌ను వదులుతుంది కానీ మనుషులకు ఎలాంటి స్వచ్ఛమైన గాలిని అందించదు. ఈ ఖోనో కార్పస్ మొక్క ప్రకృతిలో అన్ని రకాల చెట్లు మొక్కల కంటే భిన్నమైన చర్య ఈ మొక్కకే ఉంటుంది సహజంగా ప్రకృతిలో ప్రతి చెట్టు మొక్క మానవాళికి ఉదయం నుండి రాత్రి అయ్యేంత వరకు మంచి గాలిని ఆక్సిజన్ ఇస్తుంటారు. ఆ తర్వాత రాత్రి చెట్లు కార్బన్డయాక్సైడ్ వదులుతాయి కానీ ఈ ఖోనో కార్పస్ మాత్రం ఉదయం రాత్రి ఎప్పుడైనా మంచి గాలి ఇవ్వటం అనేది ఎప్పుడూ ఉండదు. ఇంకా నిత్యం కార్బన్డయాక్సైడ్‌ను వదులుతూ ఉంటుంది.

### నిర్ధారణ ఎలా...

ప్రకృతిలో మానవులు చేస్తున్న అనేక చర్యల్లో భాగంగా పక్షుల్లో జంతువుల్లో చెట్లలో పాములలో చివరికి మనుషులలో కూడా హానికరమైన మనుషులు ఉంటారని కొన్ని జాతులు హానికరంగా



గుర్తిస్తున్నట్లుగానే ఈ ఖోనో కార్పస్ మొక్కలను కూడా గుర్తించడం జరిగింది. అది ఎలా అంటే ఈ ప్రకృతిలో ఏ రకమైన చెట్టు ఎంత పెద్ద లేక చిన్న ముళ్ళ పొదలు కలిగిన చెట్లపైన అయినా జీవులైన తేనెటీగలు వివిధ రకాల పరుగులు పక్షులు చెట్లను తాకుతూ వాటిపై కొద్ది నిమిషాలు అయినా ఉంటాయి. కానీ ఖోనో కార్పస్ చెట్టుపై ప్రకృతిలో ఇటువంటి చర్యలు అనేవి ఉండవు అందుకే ఆ మొక్కలను మానవాళికి హానికరమైన మొక్కగా రైతులు ప్రజలు గుర్తించడం జరుగుతుంది. ఇది ఇలా ఉంటే పాలేరు క్యాంపు కార్యాలయానికి కొన్ని కొన్ని సందర్భాలలో అధిక సంఖ్యలో ప్రజలు వస్తూ ఖోనో కార్పస్ చెట్ల కింద నిల్చోని ఉంటున్న అనేక సందర్భాలు ఉంటున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఈ చెట్లును తొలగించకపోతే భవిష్యత్‌లో ప్రజలు అనారోగ్యాల పాలు కావాల్సి వస్తుంది కనుక అధికారులు వెంటనే గుర్తించి గంగ బండ తండ పంచాయితీలో అనేకంగా ఉన్న ఈ ఖోనో కార్పస్ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### గంగ బండ తండా పంచాయితీ సెక్రెటరీ కొత్తపెల్లి ఉపేందర్ వితరణ....

ఖోనో కార్పస్ మొక్కలకు సంబంధించిన వివరాలను ప్రజాపక్షం విలేకరి కోరగా పంచాయితీ సెక్రటరీ మాట్లాడుతూ మా పై అధికారులను సంప్రదించి మేము అనేక విధాలుగా పరిశీలన చేసిన అనంతరమే ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

# పేదోడి మోకాలి శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన కోట సామేలుకు గత ఆరు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో మోకాలు ముక్కలు ముక్కలు అయింది. అదే సమయంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఖమ్మం ప్రైవేట్ హాస్పటల్‌లో ఆపరేషన్ చేశారు. అయినా ఫలితం లేకపోగా కాలు మొత్తం పాడైపోయి చాలా ప్రమాదకంగా మారింది. ఈ విషయం భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూర్ణచంద్రారెడ్డి తెలుసుకుని సామేలు ఇంటికి వచ్చి పరిశీలించి సహృదయంతో స్పందించి తిరువూరు హన్సు ఎముకల హాస్పటల్ నందు చేర్పించి డాక్టర్‌తో మాట్లాడి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చుల సగం భరిస్తానని హామీ ఇచ్చి మనోధైర్యం చెప్పి ఆపరేషన్ చేయించారు. నిరుపేద కుటుంబానికి ఆర్థికంగా భరోసా ఇచ్చిన పూర్ణచంద్రారెడ్డికి సామేలు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# వెంకటేశ్వర సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, జ్వాలా తోరణ దగ్ధం, దీపోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు శివాలయం నందు జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామి వారి కోనేరు వద్ద దీపోత్సవ కార్యక్రమం, గంగాహారతి కార్యక్రమాలను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నపూర్ణ అన్నదాన భవనం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని హనుమాన్ తండా, చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల తదితర గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సివిల్ సప్లై అధికారి చందన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులతో మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యమును కొనుగోలు కేంద్రానికి వచ్చేటట్లు చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు ఇన్చార్జులు కృషి చేయాలని, పంట కోశాక సరిగా ఆరనిచో గింజలకు తెగులు సోకి రంగు మారే ప్రమాదం ఉందని, నేల మీద టార్పాలిన్ కానీ ప్లాస్టిక్ సంచులు కానీ వేసి పంటను నూర్చుకోవాలని, నూర్పులలో రాళ్లు, మట్టి పెడ్డలు చెత్తా చెదారం వంటి వ్యర్థ పదార్థాలు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని కొనుగోలు కేంద్రాలు ఇన్చార్జిలకు తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొని వచ్చి మద్దతు ధరను పొందాలని రైతులను కోరారు. వారి వెంట ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షునిగా మేడా



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రైతు సంఘం వైరా మండలం మహాసభలు ముగింపు సందర్భంగా మేడా శరబంది కిలారు శ్రీనివాసరావులను అధ్యక్షు కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు అమరనేని అప్పారావు, బుంగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు గాలి అరుణ, చింతనిప్పు చంద్రరావు, శీలం వెంకటరెడ్డి, షేక్ జానిమియా ఎన్నికయ్యారు. చిత్తారు నాగరాజు, షేక్ బిలాల్, లక్ష్మణ్, ఆళ్ల శ్రీనివాస్, మాగంటి సునీల్, షేక్ మజీద్‌బి, రహినా, గరిడేపల్లి సుబ్బారావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, నర్వనేని చిన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పూజారి సాకారంతో సాముహిక షష్టిపూర్తి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడుగ్రామంలో 65 ఏండ్లు నిండిన 35 వృద్ధ జంట దంపతులకు కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం రామాలయంలో షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. వీరికి గ్రామంలోని 35 జంటలు నూతన, వస్త్రాలు, శాలువలు, పూలదండలను సొంత ఖర్చులతో తీసుకువచ్చి జరిపించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన పూజారి కాశవజ్జల పురుషోత్తం శాస్త్రీని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పెద్దలు పాల్గొన్నారు.

# జిల్లా జడ్జి దంపతుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కూసుమంచిలోని గణపేశ్వరాలయంలో ఖమ్మం జిల్లా జడ్జి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి దంపతులకు రిటైర్డ్ అడిషనల్ డీసీపీ వీర ప్రతాప్‌రెడ్డి, అధికారులు, ఆలయ ఛైర్మన్ ప్రదీప్‌రెడ్డి, అధికారులు, ఆలయ ఈవో కాముని శ్రీకాంత్ శివపార్వతుల చిత్రపటాన్ని అందించి సన్మానం చేశారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివాలయంలో భక్తులతో కోలాహలంగా మహిళలు దీప కాంతులతో ఆలయ ఆవరణ ఆహ్లాదకర వాతావరణంలో నిండిపోయింది.

# అప్పుడు అలా చెప్పారు.. ఇప్పుడేం చెబుతారో..?



**- ఈనెల 12న ఎంఎల్ఏ తెల్లంపై విచారణ**
**-కాంగ్రెస్‌లో చురుకుగా ఉన్నట్లు ఆధారాలు రెడీ**
**- ఉప ఎన్నిక అనివార్యం అంటున్న విశ్లేషకులు**





**ప్రజాపక్షం/భద్రాచలం :** నేను పార్టీ మారలేదు. ప్రజా ప్రయోజనాలు, నియోజకవర్గాభివృద్ధి దృష్ట్యా ముందుకు సాగుతున్నా అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన నోటీసుకు బిఆర్ఎస్ బి ఫామ్‌తో భద్రాచలం 119 నియోజకవర్గ ఎంఎల్ఏ గా గెలుపొందిన డా. తెల్లం వెంకట్రావు ఇచ్చిన వివరణ ఇది. అప్పుడైతే అలా చెప్పారు, అది అప్పటి మాట, కానీ ఈ నెల 12న స్పీకర్ ఎదుట విచారణకు హాజరు కానుండటంతో ఇప్పుడు ఏమి చెబుతారో అనే ఉత్కంఠ వాతావరణం నెలకొంది. బిఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎంఎల్ఏలు పార్టీ ఫిరాయింపుల నిరోదక చట్టం కింద అనర్హులుగా ప్రకటించాలని, దీనిపై స్పీకర్ మూడు మాసాల్లో నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జూలై 25న సుప్రీం కోర్టు తీర్పు వెలువరిచిన విషయం విధితమే. కాగా ఈ విషయంపై నేడు విచారణ జరగాల్సి ఉండగా, ఎంఎల్ఏ వరుస సంఖ్య ప్రకారం 12వ తేదికి వాయిదా పడినట్లు స్వయంగా ఎంఎల్ఏ డా. తెల్లం వెంకట్రావే చెప్పారు. కాగా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంలో భద్రాచలం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరై ఆశావాహుల నుండి దరఖాస్తులను సైతం స్వీకరించారు. దీంతో అప్పట్లో ఈ వ్యవహారం పత్రికలతో పాటు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో హల్‌ఛల్ చేసింది. విద్యావంతుడైన వెంకట్రావు కావాలనే ఈ సమావేశానికి హాజరయ్యారా, లేక ప్రత్యర్థులు పన్నిన వలలో చిక్కుకున్నారా, ఏదైతే అద్దైందిలే అనే ఉద్దేశ్యంతో పాల్గొన్నారా అనే చర్చ నేటికీ సాగుతోంది. అంతే కాకుండాఈ మధ్య కాలంలో జరిగిన మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసిన వేడుకల్లో పాల్గొన్నారు. పొంగులేటికి రాజకీయ శిష్యునిగా చెప్పుకునే తెల్లం అభిమానంతో హాజరయ్యారా, గురు భక్తి ప్రదర్శించుకునేందుకు ప్రయత్నించారా అనే ప్రశ్న కూడా తలెత్తింది. మరో ప్రక్క గత కొద్ది రోజుల క్రింత పినిపాక నియోజకవర్గంలోని మణుగూరులో బిఆర్ఎస్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వసం సృష్టిస్తే ఓ బిఆర్ఎస్ ఎంఎల్ఏగా కనీసం పెదవివిప్పక పోవడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతిమంగా జరుగుతున్న పరిణామాలు, చోటు చేసుకుంటున్న సంఘటనలు పరిశీలిస్తే డా.తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటి పక్షే అంటూ ప్రత్యర్థులు మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు క్రియాశీలకంగా ఉన్నట్లు పూర్తి ఆధారాలు ఉన్నాయంటూ బిఆర్ఎస్ శ్రేణులు కుండ బద్దలు కొట్టి చెబుతూనే ఆయన పార్టీ ఫిరాయింపు నిరోదక చట్టం క్రింద ఎంఎల్ఏను అనర్హునిగా ప్రకటించాలని, ఉదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వీరవిధేయునిగా ఎంఎల్ఏ మెలుగుతున్న తీరు తెన్నులు, ఫొటో ఆధారాలతో బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ వద్ద ఫైల్ రెడీ అయ్యిందని భద్రాచలం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎంఎల్ఏలుస్పీకర్ ముందు వారి వాదనను వినిపించాల్సి ఉంది. దీనిని రికార్డు చేసి స్పీకర్ కోర్టుకు సమర్పిస్తారు. అయితే కోర్టుకు కావాల్సింది పూర్తి సాక్షాధారాలని, కల్లబొల్లి మాటలు కాదని, భద్రాచలం నియోజకవర్గంలో ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీకి వీర విధేయునిగా వ్యవహరిస్తూ ప్రత్యర్థులకు అవకాశం కల్పిస్తున్నారని, ఆయన వ్యవహార శైలిని చూస్తుంటే ఏమైనా పర్వాలేదు అన్నట్లుగా ఉందని, పూర్తి ఆధారాలతో వెంకట్రావు వ్యవహారం బట్టబయలైతే భద్రాచలం నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యం అని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఉప ఎన్నిక జరిపించాలి : బిఆర్ఎస్ నాయకులు రావులపల్లి

బిఆర్ఎస్ పార్టీలో పోటీ చేసి ప్రజల నుండి ఓట్లు వేయించుకుని తీరా కాంగ్రెస్ పార్టీలో స్వార్థంతో చేరడం ముమ్మాటికీ తప్పే. ఎంఎల్ఏ తెల్లంను అనర్హునిగా ప్రకటించాలి, భద్రాచలం నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిపించాలని. ఓ పార్టీలో గెలిచి మరో పార్టీలోకి దూకే ఫిరాయింపు దారులకు ఇది ఓ గుణపాఠం కావాలి.

# పంటను ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులు





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గత 20 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నా తమ పోడు భూముల్లో పత్తి పంటను మంగళవారం సాయంత్రం ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారని బాధితులు బుధవారం వాపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రాయి కంపాడు బీట్ పరిధిలో పోడు భూముల్లో పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ పోడుదారులు పీకిన పత్తితో పోడుదారులైన గుగులోత్ వాలీ, తేజవత్ సరోజనల తమ నిరసన వ్యక్తం చేశారు. సుమారు ఐదు ఎకరాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నామని ఇప్పుడు చేతికి వచ్చిన పంటను సుమారు 100 మంది ఫారెస్ట్ అధికారులు చెప్పలేదన్నారు. చేతికొచ్చిన పంటను ఎలా నాశనం చేస్తారని వారు ప్రశ్నించారు. నష్టపోయిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలని పోడు రైతులు డిమాండ్ చేశారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించటంతో గ్రామస్తులు అభినందించారు. బుధవారం విద్యార్థిని ని ఘనంగా సన్మానించారు. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం గ్రామానికి చెందిన నెమలి వెంకటేశ్వర్లు రేణుక దంపతుల కుమార్తె నెమలి జ్యోత్స్న ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు ను సాధించింది. వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించి, కూతురు ను కష్టపడి చదివించారు. వారి కష్టం ను వృధా కాకుండా సీటు సాధించింది. 1 నుంచి 4 వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. 5 నుంచి 10 వరకు బెస్ట్ అవెయిల్ బెల్ ద్వారా ఖమ్మం లోని సెంట్ జోసెప్స్ స్కూల్ చదివారు. పదో తరగతి లో 10 కు 10 మార్కులు సాధించి ప్రగతి సాధించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ మీడియట్ చదువు పూర్తి చేసి, 966 మార్కులుసాధించి ప్రతిభ చూపారు. నీట్ లో రాష్ట్ర 5వేల ర్యాంకు సాధించి, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో సీటు సాధించింది. దీంతో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. వైద్యాధికారిగా గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నంబూరి రామారావు, సూరేపల్లి రామారావు, సూరేపల్లి ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కార్తీక పౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం లో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం రెండో రోజున ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి ప్రారంభించారు. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో సందడిగా మారింది. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు జట్ల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఏటా అనవాయితీగా గ్రామంలో గ్రామీణ క్రీడలను నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. యువత లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు పోటీలు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, అడపాల రామారావు, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, రెడ్డబోయిన నవీన్, ఇస్లావత్ బాలాజీ, యం. సుధీర్, పగిళ్ల ఆశోక్, వెంకన్న, ఎన్.బాబు తదితరులు పాల్గొన్నారు.

# 51.9 కేజీల గంజాయి పట్టివేత

**- కారు, మోటార్ సైకిల్ సీజ్**
**- ముగ్గురిపై కేసు నమోదు, ఇద్దరు అరెస్ట్**




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఒడిస్సా నుండి అక్రమంగా కేరళాకు తరలించుకు పోతున్న నిషేదిత గంజాయిని పట్టణంలోని కూనవరం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. బుధవారం అనుమానాస్పదంగా అతివేగంతో వస్తున్న కేఎల్ 08 బిఎక్స్ 4855 నెంబర్ గల కారును ఎక్సైజ్ అధికారులు ఆపి సోదాలు చేయగా కారు ఇంజన్ ఉండే ప్రదేశంలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని స్వాదీనం చేసుకుని తూకం వేయగా 51.5 కేజీలు ఉన్నాయి. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.26 లక్షల వరకు ఉంటుంది. గంజాయితో పాటు కారు, మోటార్ సైకిల్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా కేరళాకు చెందిన జకారియా పర్యాల్, నసిర పూర్తియా వేట్టల్ ను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశారు. అదే విధంగా అరెస్టు అయిన వారు ఇచ్చిన సమాచారం మేరకు సూర్యపేటకు చెందిన కందుల రవి అనే వ్యకిపై కూడా కేసునమోదు చేశారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ ఖాసీం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమీషనర్ గణేష్ తెలిపారు.

# పేదలకు అండగా పిఎస్ఆర్ ట్రస్టు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పీఎస్ఆర్ ట్రస్టు పేదలకు అండగా నిలుస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు అన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన 32 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ట్రస్టు అర్థిక సహాయం ను అందించారు. బుధవారం మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక వైపు ప్రభుత్వం ద్వారా కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేస్తూ, మరో పక్క ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎందరో అభాగ్యులకు ట్రస్టు అండగా నిలుస్తూ ధైర్యం ను కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ లు వంగవీటి నాగేశ్వరరావు, పెంటమళ్ల పుల్లమ్మ, కుక్కల హనుమంతరావు, గోళ్ల శ్రీను, పాకనాటి కన్నారెడ్డి, గండు సైదులు,మరికంటి రమేష్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపై ఆంక్షలు ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పత్తి పంటపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను తొలగించి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతాంగాన్ని బతికించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, కల్తి రాములమ్మలు డిమాండ్ చేశారు. పత్తిపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు తొలగించాలని ఈ నెల 10న, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రేగులగూడెం, చంద్రాలగూడెం గ్రామాలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సంధర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక పోవటంతో రైతులు నష్టాల భారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను వలన నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.పత్తి కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన ప్రవేట్ కౌంటర్లను వెంటనే నిలిపి వేయాలన్నారు. సొసైటీలో తీసుకొన్న రైతు రుణ మాఫీ చేయాలన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 10న, జరిగే ధర్నాకు రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, నరసింహ, సుగుణ, మల్లేష్, రాములు, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

